వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ కార్పొరేటర్లతో కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నీటి సమస్య, బిల్లులు, కరెంట్ సమస్య తదితర వాటిపై చర్చించారు. విద్యుత్, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. నాయకులకు ప్రజల్లో ఉంటూ వారికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న మంచినీటి, బిల్లులు, విద్యుత్ తదితర సమస్యలను త్వరలో పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు అస్లాం, ముద్దం రాము, సాగర్‌గౌడ్, నాయకులు నాగరాజు, పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, సయ్యద్ ఖాజా, పాండు, టింకురెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్లు

మణికొండ: ప్రభుత్వ పథకాలు సరైన అర్హులకు అందక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, వాటి సమస్యలు తొలగించాలని మణికొండ కౌన్సిలర్లు ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి కోరారు. డబుల్ బెడ్రూమ్‌ల కోసం వందలాది మంది దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటి వరకు మంజూరు కాకపోవటంతో వారు నిలదీస్తున్నారన్నారు. రేషన్ కార్డుల్లో తప్పొప్పులు సరిచేసుకునేందుకు అవకాశం లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు యాలాల లావణ్యనరేష్, పి.శైలజ, మణికొండ మహిళా సంఘాల నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ఎన్నికలు వచ్చే లోపు ప్రతి నాయకుడు కలిసికట్టుగా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు బీఆర్ఎస్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. సోమవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మణికొండ మున్సిపాలిటీ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు లేకుండా సమన్వయంతో పని చేయాలని గత ఎన్నికల కన్నా అత్యధిక మెజార్టీని సాధించేలా కృషి చేయాలన్నారు. కొంత మంది నాయకులు పదవులు తీసుకుని పార్టీకి పనిచేయటం లేదని, అలాంటి వారిని సహించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి పథకాలను ప్రవేశపెట్టిందని, అన్ని వర్గాల వారు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, రామకృష్ణారెడ్డి, మల్లేష్, సీతారాం, బషీర్, సత్యనారాయణ, రూపారెడ్డి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని కాటేదాన్ క్లస్టర్ కమిటి కన్వీనర్ రుద్రకుమార్ వెల్లడించారు. మార్చి 1వ తేదీన శంషాబాద్ ఏఎల్‌ఓ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని ప్రతి రోజు ఏడు గంటల పని, ఐదు రోజుల పనిదినాలు వారానికి మాత్రమే అమలు చేయాలన్నారు. వలస కార్మిక చట్టం 1979ని ఈ ప్రాంతంలో అమలు చేయకుండా యాజమాన్యాలు మొండి వైఖరి వ్యవహరిస్తున్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని గతంలో ఉన్న లేబర్ చట్టాలను పెరిగిన ధరలకు అనుగుణంగా మార్చి కార్మికులకు ఉపయోగపడేలా పునరుద్ధరించాలన్నారు. కార్మికులందరికి ఈఎస్ఐ, పీఎఫ్, ఐడీ కార్డు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, సచిన్, ప్రవీణ్, రాహుల్, జగన్, గంగాధర్, సూర్యకాంత్, జగన్నాథ్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి ఫ్లై ఓవర్ సమస్య

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని సిద్ధాంతి ఫ్లై ఓవర్ సమస్య గురించి చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి దృష్టికి తీసుకెళ్లారు. ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు నిర్మాణం చేపడుతున్న ఫ్లై ఓవర్ డిజైన్‌లో ఉన్న కొన్ని కారణాలతో శంషాబాద్ పట్టణంలోని సిద్ధాంతి బస్తీ వాసులకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. స్కూల్, కళాశాల, ప్రభుత్వ కార్యాలయాలు, రేషన్‌తో పాటు అంత్యక్రియలకు సైతం రోడ్డు దాటాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత నిర్మాణంలో ఉన్న డిజైన్ లోపాలతో భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. ఈ విషయమై ఇటీవల శంషాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నా కార్యక్రమాలు కూడా జరిగినట్లు వివరించారు. సమస్య పరిష్కారానికి బ్రిడ్జిని పొడిగించడం లేదా సిద్ధాంతి నుంచి మల్లికా కన్వెన్షన్ వరకు మరో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని గడ్కరికి వివరించారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

రాజేంద్రనగర్: ఇద్దరి నిండుప్రాణాలను కాపాడిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లను రాజేంద్రనగర్‌లోని శంషాబాద్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కానిస్టేబుళ్లు రాజశేఖర్ సీపీఆర్ చేసి బాలాజీని, కానిస్టేబుల్ రమేష్ హిమాయత్‌సాగర్ చెరువులో దూకిన అనిత అనే గృహిణిని కాపాడారు. ఇప్పటికే వీరిని సైబరాబాద్ సీపీ అభినందించి నగదు పురస్కారం అందించారు. సోమవారం ఉదయం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తమ సిబ్బందితో ఘనంగా సన్మానించి అభినందించారు.

క్లుప్తంగా

రాంప్రసాద్‌కు డాక్టరేట్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి నలసాని రాం ప్రసాద్‌కు డాక్టరేట్‌ను సోమవారం ప్రకటించారు. 'ఆచార్య పింగళి లక్ష్మీకాంతం జీవితం, రచనల పరిశీలన' అనే అంశంపై తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సుమారు ఆరేళ్ల పాటు పరిశోధన చేశారు. ఈ మేరకు హెచ్‌సీయూ డాక్టరేట్ డిగ్రీని ప్రకటించారు. రాంప్రసాద్‌ను ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి రాములు, గోనా నాయక్ ,పమ్మి పవన్‌కుమార్, విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యా తిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ విజయకుమారి అభినందించారు.

బీఆర్ఎస్‌ది సంక్షేమ పాలన: ఎమ్మెల్యే మాగంటి



చెక్కులు అందజేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

గోల్కొండ: బీఆర్ఎస్‌ది సంక్షేమ పాలన అని, సీఎం కేసీఆర్ పక్కా సెక్యులర్‌వాది అని జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్ల తండ్రి అప్పు చేయకుండా తన కూతురి పెళ్లి చేయడానికి ముఖ్యమంత్రి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటి వరకు లక్షలాది ఆడపిల్లల పెళ్లిళ్లు ఈ పథకం ద్వారా జరిగాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్‌కుమార్, పూస వేణుగోపాల్, లక్ష్మణ్, రమేష్, రాము, శ్రీను తదితరులున్నారు.

సన్మానం

చార్మినార్: పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కార్యవర్గ సభ్యుడు కోట శంకర్ ఆనంద్ రావును మున్నూరు కాపు మహాసభ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని నామాల గుండు వద్ద మున్నూరు కాపు నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయనకు ఈ సన్మానం జరిగింది. నూతన భవనానికి ఆర్థిక సాయం చేసినందుకు సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ రావు, వెంకటేశ్వర్ రావు, లక్ష్మణ్, రమేశ్, వినోద్, అనిల్, రవికాంత్, శ్రీనివాస్ రావు, రామారావు, నాగరాజు, పవన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జషన్ కార్యక్రమాలకు ప్రత్యేక బస్సులు ప్రారంభం



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అంజుమన్-ఇ-అలావీ అక్బారీ వద్ద నిర్వహిస్తున్న జషన్-ఇ-హజ్రత్ అబ్బాస్ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను దారుషిఫా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీర్ హైదర్ అలీ జాఫ్రీ సోమవారం ప్రారంభించారు.

'అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం'

అబిడ్స్: గోశామహల్ నియోజకవర్గంలో వాటర్ బోర్డుకు సంబంధించిన మరమ్మతులు, అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతామని మెట్రో వాటర్ బోర్డు డైరెక్టర్ అజ్మీరా కృష్ణ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయనను కలిసి ఇమ్లిబన్‌లో బోర్ల మరమ్మతులు, నియోజకవర్గం నలుమూలలా వాటర్ బోర్డు మరమ్మతులు, అభివృద్ధి పనులపై మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా అజ్మీరా కృష్ణ మాట్లాడుతూ.. వేసవికాలం వచ్చినందున గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో బోర్ల మరమ్మతులు వెంటనే చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా పాడైపోయిన బోర్‌వెల్స్‌ను వారం రోజుల్లో మరమ్మతులు చేయాలన్నారు. వేసవికాలం కావడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వాటర్‌బోర్డు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు.

'అక్షయపాత్ర'కు వాహనాల అందజేత



ఫుడ్ డెలివరీ వాహనాలను అందజేస్తున్న ఎం.ఎస్.ఎన్ గ్రూప్ కంపెనీల చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయ పాత్రకు ఎం.ఎస్.ఎన్ గ్రూప్ కంపెనీల చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి సోమవారం కొండాపూర్‌లోని వైట్ ఫీల్డ్‌లో రెండు ఫుడ్ డెలివరీ వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా అందజేశామని చెప్పారు. పేద విద్యార్థులకు వేడివేడి బోజనం సకాలంలో అందించేందుకు అక్షయ పాత్రతో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్.గ్రూప్ డైరెక్టర్లు సింధుజారెడ్డి, నిఖిల్ తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమావేశం

రాయదుర్గం: రాయదుర్గం ఎంఎస్ కన్వెన్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం సోమవారం ఆత్మీయ పలకరింపులతో సాగింది. రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సమావేశాన్ని పూర్వవిద్యార్థులు ఎన్ సుభాషిణి, అనిత, లక్ష్మణ్, మల్లేష్‌ల పర్యవేక్షణలో సాగింది. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.

వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజేంద్రనగర్: వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎంహెచ్‌వో అంజనేయులు పేర్కొన్నారు. సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్కూల్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్మానుష్య ప్రదేశాల నుంచి వెళ్తున్న సమయంలో కుక్కలు గుంపుగా ఉంటే ఇతరుల సహాయం తీసుకోవాలన్నారు. రోడ్లపై ఉన్న కుక్కలను రాళ్లతో కొట్టడం చేయరాదని చేతుల్లో తినుబండారాలు, ప్లాస్టిక్ కవర్లు తీసుకువెళ్తున్న సమయంలో కుక్కలతో జాగ్రత్తగా ఉండాలన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచు మాధవియాదగిరిరెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ దివ్యశ్రీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



గోల్కొండ: ఏ ఒక్క విద్యార్థిని తక్కువ అంచనా వేయొద్దని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైఎస్ అనురాధ దేవి అన్నారు. సోమవారం గోల్కొండ భడాబజార్‌లోని పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మెదడుకు పదునుపెట్టారు. భూకంపాలు, ఫైర్ అలారం, క్లాప్ ఆన్ స్విచ్ ట్రెన్ డిటెక్ట్ వంటి అద్భుతమైన నమూనాలు తయారు చేసి తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులచే శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ అనురాధదేవి మాట్లాడుతూ.. ఇటీవలె టర్కీలో సంభవించిన భూకంపంపై విద్యార్థులు ఎంతగానో కదిలిపోయారని భూకంపాలు ఎందుకు సంభవిస్తాయి, వాటి తీవ్రత జరిగే నష్టాలను విద్యార్థులు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, సుబ్బారావు, కవిత, ఇజ్రాయెల్, నిర్మల, స్వాతి ప్రియాంక తదితరులున్నారు.

జాతీయస్థాయి క్రీడలో సువర్ణ సత్తా



సువర్ణను అభినందిస్తున్న రిజిస్ట్రార్, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ బాలికలు జాతీయస్థాయి క్రీడలలో రాణిస్తున్నారని రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ అన్నారు. హర్యాణలోని శ్రీ చౌదరి చరణ్‌సింగ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 20 నుంచి 24 వరకు జరిగిన క్రీడోత్సవాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొనగా మహిళల విభాగం నుంచి సువర్ణ త్రోబాల్ విభాగంలో కాంస్యం సాధించింది. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సువర్ణను రిజిస్ట్రార్ శాలువాతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సీమ, డాక్టర్ సత్యనారాయణ, పీడీ శ్రీ విద్యాసాగర్,రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు గోదాంలలో అగ్ని ప్రమాదం

లంగర్‌హౌస్: ప్రమాదవశాత్తు చెలరేగిన మంటల్లో రెండు గోదాములు అగ్నికి ఆహుతయ్యాయి. లంగర్ హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.12 లక్షల ఆస్తి నష్టం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ డిఫెన్స్‌కాలనీలో మూసీ నది ఒడ్డున మిర్జా ఇస్మయిల్ బేగ్, అతని తమ్ముళ్లు కలిసి స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్క్రాప్ గోదాములో మంటలు చెలరేగి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. అనంతరం మరో వైపు ఉన్న అత్తాపూర్‌కు చెందిన ముకేష్ చౌదరికి చెందిన జగదంబ ట్రేడర్స్ వారి గోదాముకు మంటలు వ్యాపించి అందులోని వస్తువులు కాలిపోయాయి. ఘటనా స్థలానికి 4 ఫైర్ ఇంజన్లు చేరుకొని రెండున్నర గంటలపాటు శ్రమించి మంటలు ఆర్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటన స్థలంలో ఉద్రిక్తత..

అగ్నిప్రమాదం చోటుచేసుకొని మంటలు చుట్టుపక్క కాలనీలలో దట్టంగా మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, స్థానికులు కలిసి ప్రమాదం జరిగిన గోదాము వద్ద ఆందోళనకు దిగారు. గోల్కొండ తహసీల్దారు, పోలీసుల ముందే గోదాముల నిర్వాహకులకు, స్థానికులకు గొడవ జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి



హోం మంత్రిని సత్కరిస్తున్న దీపాంకర్ పాల్

చార్మినార్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ సర్వోజనినీ హరే కృష్ణ సంకీర్తన కమిటీ, హైదరాబాద్ బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన సంకీర్తన పూజా కార్యక్రమాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహమూద్ అలీకి బెంగాలీలు పూలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. కుల మతాలకతీతంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. పాతనగరంలోని బెంగాలీలు ప్రతి యేడు నిర్వహించుకునే ఈ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షుడు దీపాంకర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతి కారకులను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆరాంఘర్ చౌరస్తాలో సోమవారం నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కాలేజీలో పీజీ విద్యాభ్యాసం చేస్తున్న ప్రీతి వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడి నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించడం కారణంగానే ఆత్మహత్య చేసుకుందని వెంటనే నిందితుడికి ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాహుల్, పవన్, మహేందర్, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

శంషాబాద్: ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు భ్రష్టు పట్టిపోయాయన్నారు. విద్యావ్యవస్థలో ఉన్న లోపాలపై అధ్యయనం చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. నిందితుడు సైఫ్‌కు కఠిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్, సూర్యప్రకాష్, మహేష్, ప్రదీప్, చందు, శివ, అఖిల్, చరణ్, భరత్,తిరుపతి పాల్గొన్నారు.

సేవాలాల్ సేవా సమితి ఆధ్వర్యంలో..

రాజేంద్రనగర్: ప్రీతి హత్యకు కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలంటూ బంజారా సేవాలాల్ సేవా సమితి అధ్యక్షులు శంకర్ చౌహాన్ ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్ నుంచి హైదర్‌గూడ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు జరుగుతూ రాష్ట్రమంతా మారణహోమం అవుతుంటే కేసీఆర్ మాత్రం కుంభకర్ణ నిద్ర నటిస్తున్నారన్నారు. ధారావత్ ప్రీతి చావుకు కారణమైన సైఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, అరుణ్‌యాదవ్, బంజారా సేవాలాల్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ..

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అబ్దెశి సదాలక్ష్మి అన్నారు. మెడికల్ కళాశాలలో సీనియర్ విద్యార్థి చేసిన ర్యాగింగ్‌కు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రీతికి న్యాయం చేయాలని సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజు రోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలకు, విద్యార్థులకు రక్షణ కరువైందని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు లేకపోవడంతోనే దాడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు.



దిష్టిబొమ్మను దహనంచేసిన ఏబీవీపీ నాయకులు



ర్యాలీ చేపడుతున్న దృశ్యం

కొత్తకోట సీఐపై హెచ్చార్సీలో ఫిర్యాదు



ఫిర్యాదు ప్రతులను చూపుతున్న యుగంధర్‌గౌడ్, చిత్రంలో బాధితుడు శివయాదవ్

నాంపల్లి: తెలంగాణ ఉద్యమకారుడు శివయాదవ్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వనపర్తి జిల్లా, కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డిని విధుల నుంచి తొలగించాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వనపర్తి జిల్లా మనిగిల్ల గ్రామానికి చెందిన బాధితుడు శివ యాదవ్‌తో కలిసి ఆయన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యుగంధర్‌గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. మనిగిల్ల గ్రామానికి చెందిన శివ యాదవ్‌ను ఈనెల 22న వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చట్టవిరుద్ధంగా ఒక రోజంతా స్టేషన్‌లోనే నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని మండిపడ్డారు. సీఐపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం పనిచేస్తున్న కొత్తకోట వనపర్తిలో కూడా అనేక దందాలకు పాల్పడుతున్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై డీజీపీ, రాష్ట్ర బీసీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడు శివ యాదవ్ మాట్లాడుతూ.. వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఓ పాత వీడియోను ఫార్వర్డ్ చేశానన్న నెపంతో వనపర్తి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నన్ను బూటు కాలితో తన్ని, టైర్‌తో విచక్షణా రహితంగా కొట్టడమే కాకుండా రాత్రంతా చిత్రహింసలకు గురిచేశారన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నుంచి తనకు ప్రాణ హాని ఉందని ఆరోపించారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు మహేందర్ నాయుడు, గ్రామస్తులు తిరుపతిరెడ్డి, రాజాగౌడ్, రాఘవేందర్, నరేష్ తదితరులు ఉన్నారు.